సాక్షి
ములుగు

శనివారం । 24 । జూన్ । 2023



మార్కెట్ ఆదాయానికి గండి

వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూర గాయల మార్కెట్‌లోని కవర్‌షెడ్ వ్యాపారులు అద్దె చెల్లించడం లేదు. దీంతో సుమారు రూ.40లక్షల అద్దె పెండింగ్‌లో ఉంది. - 10లో▸



మంచానికే పరిమితం - 10లో▸

తాటిచెట్టు పైనుంచి పడటంతో నెల్లికుదురు మండలం మేచరాజుపల్లికి చెందిన సతీశ్‌కు నడుం విరడంతో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబం రోడ్డున పడే అవకాశం ఉంది.

గరిష్టం/కనిష్టం
29.0^{0}/19.0^{0}

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలు చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ములుగులో కేంద్రీయ విద్యాలయం!

ములుగు: ములుగులో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ చేసిన ప్రయత్నం ఫలించనుంది. ఈ మేరకు శుక్రవారం సీతారాంనాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించి నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. ఈ నెల 28న కేవీ బృందం ములుగుకు రానున్నట్లు తెలిపారు. కలెక్టర్ నివేదికను త్వరగా పూర్తి చేసి అందిస్తారని ఆశిస్తున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు: ములుగు జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లోని ఖాళీలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్న పోస్టులకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్‌ఓ-01, పీజీసీఆర్టీలు-35, సీఆర్టీలు-08, పీఈటీ-01 పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని, వచ్చే నెల 7వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల అలాట్ చేసి ఆన్‌లైన్ పద్ధతిలో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుందన్నారు.

వనదేవతలకు మొక్కులు




ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మలను పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పాయం మానేశ్వర్‌రావు శుక్రవారం దర్శించుకున్నారు. 2014 నుంచి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న ప్రయత్నంలో భాగంగా అమ్మవార్ల దర్శించుకుని దీవెనలు పొందారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని పడిగాపూర్, కాల్వపల్లి, బీరెల్లి, మేడారం గ్రామాల్లోని బీఆర్‌ఎస్ సర్పంచులు, సీనియర్, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. తనకు అవకాశం వస్తే ఈ ప్రాంత స్థానికుడిగా తనను ఆదరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు రామకృష్ణ, హన్మంతారావు, లాడే కృష్ణ, కొత్తపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఏటూరునాగారం: అక్రమంగా 12 బస్తాల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని 163 జాతీయ రహదారి మొదటి బ్రిడ్జి వద్ద హెడ్ కానిస్టేబుల్ కె. రమేశ్, కానిస్టేబుళ్లు సుధాకర్, ధ్రువలు కలిసి వాహనాలు తనిఖీ చేయగా ఆటోలో పీడీఎస్ బియ్యం వెళ్తుండగా పట్టుకున్నారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా వెంకటాపురం(కె) మండలం అలుబాకకు చెందిన గంగిబోయిన కృష్ణార్జునరావు చెందిన వ్యక్తిగా వెల్లడించారన్నారు. ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆటోను సీజ్ చేసి 5.72 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు.

పేదలకు అండగా కేంద్ర ప్రభుత్వ పథకాలు



ములుగు రూరల్: పేదలకు అండగా కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రవేశ పెడుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో తొమ్మిది సంవత్సరాలు సుపరిపాలన అందించారన్నారు. గడపగడపకు తిరుగుతూ పథకాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రవిశంకర్, శ్రీనివాస్, స్వప్న, రమాదేవి, శ్యామల, కిషోర్, మురళి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మా భూములివ్వం!

పీసా గ్రామసభలో ఆదివాసీల తీర్మానం

- మేడారంలో వీఐపీ భవన నిర్మాణాలకు 19.20 ఎకరాల కేటాయింపు
- అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్



పీసా గ్రామసభలో భూములు తీసుకోవద్దంటూ చేతులెత్తిన ఆదివాసీలు

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారంలో వీఐపీల భవన నిర్మాణాల కోసం ప్రభుత్వ అధికారులు ఇటీవల భూసర్వే నిర్వహించారు. సమ్మక్క సారలమ్మ అలయం వెనకాల ఆదివాసీలకు చెందిన 19.20 ఎకరాల భూమిని నిర్మాణాల కోసం సర్వే చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. దీంతో అప్పటి నుంచి సంబంధిత భూ ఆదివాసీ రైతులు మా భూములను నిర్మాణాలకు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ విషయంపై పలుమార్లు కలెక్టర్, ఆర్డీఓ స్థాయిలో ఆదివాసీలతో సమావేశాలు నిర్వహించి చెప్పినా.. భూములు ఇవ్వమని తేల్చి చెప్పారు. ఇవే భూములపై ఆధారపడి కుటుంబాలను పోషించు కుంటున్నామని, ఈ భూములనే నిర్మాణాలకు ఇవ్వాలని ఒత్తిడి చేసినా వారు తలొగ్గ లేదు. 1996లో మేడారం రాష్ట్ర పండుగగా గుర్తించిన నాటి నుంచి మేడారంలోని ఆదివాసీ రైతుల భూములను అభివృద్ధి పనుల కోసం తీసుకుంటున్నారే తప్ప తమకు ప్రత్యామ్నాయ చూపటం లేదన్నారు. ప్రతి ఏటా జాతరకు అభివృద్ధి నిర్మాణాల పేర భూములను లాక్కుంటూ తప్ప ఆదివాసీ రైతుల బాగోగులు ఆలోచించటం లేకుండా అధికారులు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

పీసా గ్రామ సభలో తీర్మానం..

ఆదివాసీలు తమ భూములను ఇచ్చేది లేదని పీసా గ్రామసభలో తీర్మానం చేశారు. శుక్రవారం మేడారంలోని సమ్మక్క భవనంలో సర్పంచ్ శిడం బాబురావు అధ్యక్షతన అభివృద్ధి పనుల భూ సర్వేపై పిసా గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో ఆదివాసీ భూ బాధితులు అభిప్రాయాల సేకరించగా, తమ భూములను ఇవ్వమని కరాఖండిగా తేల్చిచెప్పారు. అంతే కాకుండా చేతులేత్తే పద్ధతిన ఓటింగ్ నిర్వహించగా అభివృద్ధి నిర్మాణాలకు 19.20 ఎకరాల భూములను ఇవ్వమని అందరూ చేతులెత్తారు. దీంతో పీసా గ్రామ సభ మెజార్టీ నిర్ణయం మేరకు భూములు ఇవ్వమనే తీర్మానం చేసి



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్

నట్లు పీసా జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తెలిపారు. పిసా తీర్మాణం నివేదికను గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు సిద్దబోయిన వసంతరావు, స్వామి, సురేందర్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మా భూమి ఇవ్వం..



నాకున్న ఎకరం భూమిని అధికారులు నిర్మాణాల కోసం ఇవ్వమంటున్నారు. నాకు ఆ భూమి తప్ప ఎక్కడా కూడా సెంటు భూమి లేదు. ఉన్న కొద్దిపాటి భూమిని ప్రభుత్వానికి ఇస్తే కుటుంబ పోషణ కష్టంగా మారుతుంది. అధికారులకు మేము భూములు ఇచ్చేది లేదు. అధికారుల నిర్ణయాన్ని విరమించుకోవాలి

- అలెం సమ్మక్క, ఆదివాసీ రైతు, మేడారం

అధికారుల ఒత్తిడి సరికాదు



మాటిమాటికి ఆదివాసీ రైతుల భూములివ్వాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడం సరికాదు. నిర్మాణం కోసం సర్వే చేసిన భూమిలో ఎకరం భూమి ఉంది. ఇలా ఆదివాసీల నుంచి ఒత్తిడి చేసి భూములు లాక్కోవడం సరికాదు. పీసా కమిటీ తీర్మాణం మేరకు అధికారులు నిర్ణయం తీసుకోవాలి.

- సిద్దబోయిన వసంతరావు, సమ్మక్క పూజారి

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్ పిలుపు
- ఐటీడీఏలో బీఏసీ లక్కీ డ్రా

ఏటూరునాగారం: బెస్ట్ అవలెబుల్ స్కీం కింద ఎంపికైన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ పోచం ఆధ్వర్యంలో బెస్ట్ అవలెబుల్ స్కీం లక్కీ డ్రాను ఐటీడీఏ పీఓ అంకిత్ డ్రా తీసి సీట్లను కేటాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఏఎస్ కింద ఎంపికైన విద్యార్థులకు తమ అధికారులు సమాచారం ఇస్తారన్నారు. భూపాలపల్లి జిల్లాలో 183 మంది బాల బాలికలు 3, 5, 8వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 30 సీట్లకు గాను 27 మందిని ఎంపిక చేశామన్నారు. అలాగే ములుగు జిల్లాలో 231 మంది దరఖాస్తు చేసుకోగా 60 సీట్లకు 60 మందిని డ్రా పద్ధతిన ఎంపిక చేశామన్నారు. ఆయా ఎంపికైన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలను కేటాయించి పూర్తి స్థాయిలో ఐటీడీఏ సహకరిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు ఇచ్చే సమాచారం మేరకు కౌన్సెలింగ్ చేయించుకొని జాయిన్ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ దేశిరాం, డిప్యూటీ ఈఓ సారయ్య, ఏసీఎంఓ రవీందర్, జీసీడీఓ సుగుణ, ఏఓ కిరణ్ కృష్ణారావు, మైనర్, శ్రీను, ప్రావ్య తదితరులు పాల్గొన్నారు.



డ్రా తీస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్

నాణ్యమైన కూరగాయలు అందించాలి

వరంగల్ రీజియన్ పరిధిలోని గురుకుల కళాశాలలు, పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలను అందించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం బాలుర గురుకుల పాఠశాలలో చికెన్, మటన్, శానిటేషన్, వంట చేసే కాంట్రాక్టులు, పండ్లు, కూరగాయలను సరఫరా చేసేందుకు టెండర్లను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ టెండర్ల ద్వారా కాంట్రాక్టు పొందిన వ్యాపారులు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలన్నారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజినల్ కోఆర్డినేటర్ వెంకన్న, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, డీటీడీఓ ఆఫీస్ సూరింటెండెంట్ పరశురాం, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలు మంజూరు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా నాలుగు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలు మంజూరయ్యాయి. రాష్ట్రంలో 17 కళాశాలు మంజూరు కాగా, అందులో ఉమ్మడి జిల్లాలో హనుమకొండ, మహబూబా బాద్, ములుగు ,జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కళాశాలలు ఈ విద్యాసంవత్సరం (2023-2024)లో ప్రారంభం కానున్నాయి. దీంతో అడ్మిషన్లు కల్పించనున్నారు. కాగా, ఇప్పటికే జనగామ జిల్లాకు రెండు డిగ్రీ కళాశాలలు ఇచ్చింది. అం దులో ఒకటి బాలుర (పాలకుర్తి), మరోటి మహిళ డిగ్రీ కాలేజీ (పెంబర్తి)లో ఏర్పాటు చేశారు. వీటిలో 2022-23 విద్యాసంవత్సర తరగతులు ప్రారంభమయ్యాయి.

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

ములుగు: ములుగుకు బీసీ డిగ్రీ కళాశాలను మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు రెడ్కో చైర్మన్ వై.సతీష్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. వెనుకబడిన మారుమూల ప్రాంతానికి డిగ్రీ కళాశాల రావడంతో ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు అండగా నిలుస్తుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఛార్జీలు భరించి ఇబ్బంది పడే విద్యార్థులకు నేడు కష్టాలు తీరనున్నాయని, కేసీఆర్ ప్రభుత్వానికి జిల్లా ప్రజలు రుణపడి ఉంటారన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్


ములుగు: ఒలింపిక్ డే రన్‌ను శుక్రవారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. ములుగు డీఎస్పీ రవీందర్ ఒలింపిక్ డే రన్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఏరియా ఆస్పత్రి నుంచి ప్రభుత్వ పాఠశాల మైదానానికి చేరుకుంది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ములుగు లాంటి చిన్న జిల్లాలో క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో ముందుండేలా చూసుకోవాలన్నారు. ఒలింపిక్ రన్‌కు హాజరైన వారికి టీ షర్ట్స్ అందించారు. డిప్యూటీ ఎస్‌ఓ, పీఈటీ, పీడీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మారెడ్డి, డిప్యూటీ ఎస్‌ఓ పీవీఆర్ చారి, పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లయ్య, వేణు, ఎస్జీఎఫ్ కార్యదర్శి మదన్‌మోహన్, కోచ్ కుమారస్వామి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీ శ్రీధర్, రవి, రాజ్‌కుమార్, లక్ష్మణ్, లావనికి, లావణ్య, సురేశ్, భాస్కర్, కార్తీక్, టీడబ్ల్యూ స్పోర్ట్స్ అధికారి ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ప్రారంభం

ములుగు: జిల్లా కోర్టు భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను శుక్రవారం హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ వర్చువల్‌లో ప్రారంభించారు. తెలంగాణ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ నవీన్‌రావు, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి తుకారాంజీ ఉన్నారు. అనంతరం ములుగులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీపీ లలిత శివజ్యోతి రిబ్బన్ కట్ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవి, అడిషనల్ కలెక్టర్ వైవీ గణేశ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామ మోహన్‌రెడ్డి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్య, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సీహెచ్ వేణుగోపాలచారి, ప్రధాన కార్యదర్శి మేకల మహేందర్, న్యాయవాదులు నర్సిరెడ్డి, మస్రగాని వినయ్‌కుమార్, బాలుగు చంద్రయ్య, రంగోజు భిక్షపతి, సునీల్‌కుమార్, బానోత్ స్వామిదాస్, కొండి రవిందర్, విజయ్, రవిప్రసాద్‌రెడ్డి, రాజేందర్, సీహెచ్ రాజేందర్, రాంసింగ్, మేకల మానస, నవత, రజిత, చీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ అధికారి రవిందర్, సిబ్బంది పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్జి లలిత శివజ్యోతి

నాణ్యమైన విత్తనాలు అందించాలి

ములుగు రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గౌస్ హైదర్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని పలు ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అడిగిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, ప్రతి రైతులకు తప్పకుండా రశీదు అందించాలన్నారు. నాణ్యతలేని విత్తనాలు అమ్మితే విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అనుమతి ఉన్న షాపులో మాత్రమే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి మునుకుంట్ల సంతోష్ ఉన్నారు.



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న డీఏఓ

ఇద్దరిపై కేసు నమోదు

ములుగు రూరల్: గుడుంబా అమ్మకాలు చేపడుతూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ సుధీర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మల్లంపల్లి గ్రామానికి చెందిన ఈరెల్లి రమ, కాశిందేవిపేట గ్రామానికి చెందిన అజ్మీర సారక్క ఇరువురు గతంలో నాటు సార అమ్మకాలు చేపడుతూ పట్టుపడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా లక్ష రూపాయల సొంత పూచికత్తుపై విడిచిపెట్టామన్నారు. ప్రస్తుతం బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి గుడుంబా అమ్మకాలు చేపడుతూ తిరిగి పట్టుపడడంతో జైలుశిక్ష విధించామన్నారు. గుడుంబా అమ్మకాలు చేపడితే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు.

నిలిచిన ఎంఆర్ఐ సేవలు

ఎంజీఎంలో పేదలకు తప్పని ఆర్థికభారం

- ఆస్పత్రికి చేరుకున్న పరికరం
- ఇన్‌స్టాలేషన్ కోసం మరో రెండు నెలలు

ఎంజీఎం: ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎంలో ఎంఆర్ఐ సేవలు నిలిచి నెలలు గడస్తున్నాయి. వందల సంఖ్యలో రోగులకు సేవలందిస్తున్నామని కాగితాలపై లెక్కలు చూపుతున్న పెద్దాస్పత్రి పరిపాలనాధికారులు ఎంఆర్ఐ సేవలు నిలిచి సుమారు 10 నెలలు గడుస్తున్నా.. పట్టించుకోవడం లేదు. వాటిని త్వరితగతిన అందుబాటులోకి తెచ్చే ప్రయత్నమూ చేయట్లేదు. ఈసేవలపై ఎవరైనా రోగులు ప్రశ్నిస్తే 'అసలు ఎంఆర్ఐ సేవలు అవసరమా? నీకు ఏ డాక్టర్ ఎంఆర్ఐ రాశాడు? నీకున్న ఆరోగ్య సమస్యకు సీటీ స్కాన్ సరిపోతుంది. వైద్యం చేయడం. మాకు తెలుసా. మీకు తెలుసా'అంటూ రోగుల బంధుమిత్రులపై ఎదురు దాడికి దిగడం ఇక్కడ సర్వసాధారణమైంది.

ఎంఆర్ఐ సేవలు తప్పనిసరి

స్పెషాలిటీ వైద్య సేవలతో పాటు.. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తూ 1500 పడకలతో కొనసాగుతున్న ఎంజీఎం ఆస్పత్రిలో ఎంఆర్ఐ సేవలు తప్పనిసరి అని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రమాదాల్లో తలకు తీవ్రగాయాల పాలవడంతో పాటు వెన్నెముక శస్త్రచికిత్సలు నిర్వహించుకునే వారికి, బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాత రోగులకు ఎంఆర్ఐ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి. ఈసేవలు నిలిచిపోవడం వల్ల పేదలు ప్రైవేట్ డయాగ్నస్టిక్స్ కేంద్రాలకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసి వైద్యసేవలు పొందాల్సి వస్తోంది.

మరో రెండు నెలలు ఆగాల్సిందే..

ఎంజీఎం ఆస్పత్రిలో పాత ఎంఆర్ఐ పరికరం పూర్తి స్థాయిలో మరమ్మతులకు నోచుకోకపోవడంతో కొత్త పరికరం అందుబాటులోకి వస్తోందని కొన్ని నెలలుగా చెబుతున్నారు. అయితే ఎంజీఎంకు ఎట్టకేలకు నూతన పరికరం చేరుకుంది. ఈ పరికరం నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిందని, ఇన్‌స్టాలేషన్‌కు రెండు నెలల టైం పడుతుందని అధికారులు చెబుతున్నారు.



నిరుపయోగంగా మారిన ఎంఆర్ఐ యూనిట్



ఎంజీఎంకు చేరుకున్న నూతన పరికరాలు

ప్రైవేట్‌కు తరలుతున్న రోగులు

ఎంజీఎంలో ఎంఆర్ఐ సేవలు నిలిచిపోవడం.. వైద్యుల లేమితో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలుతున్నారు. పక్షవాత రోగులు ఎంఆర్ఐ నిర్ధారణ పరీక్షల తర్వాతే ఆ రోగి ఆరోగ్యశ్రీకి అర్హుడు అవుతాడా? కాదా అనేది నిర్ధారిస్తారు. ఎంజీఎం ఎంఆర్ఐ సేవలు లేవనే విషయాన్ని తెలుసుకున్న ఆరోగ్య శ్రీ అనుమతి ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యసేవలు పొందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పంటలపై అవగాహన



మాట్లాడుతున్న డీఏఓ విజయభాస్కర్

చిట్యాల: వానాకాలం పంటల ప్రణాళికలతో పాటు చిట్యాల, టేకుమట్ల రైతుబంధు సమితి కో-ఆర్డినేటర్, సభ్యులకు వారి విధుల గురించి శుక్రవారం మండలకేంద్రంలోని రైతువేదికలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కువ మోతాదులో వర్షాలు పడిన తర్వాతనే రైతులు పత్తి గింజలను నాటుకోవాలని సూచించారు. రైతులు వరినార్లు త్వరగా పోసుకోవాలన్నారు. కొంతమంది రైతులు ఆలస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుబంధు కార్యవర్గ సభ్యులు గ్రామాలలోని రైతులకు వివిధ పంటలపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం రైతుబంధు జిల్లా కో-ఆర్డినేటర్ హింగే మహేందర్‌జీ మాట్లాడుతూ రైతులు 1001రకం వరి గింజలను సాగు చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్ రెడ్డి, చిట్యాల మండల కో-ఆర్డినేటర్ మడికొండ రవీందర్‌రావు, చిట్యాల, టేకుమట్ల కార్యవర్గ సభ్యులు పిట్ట సురేష్, చిదిరాల సరోజన, పైడాకుల సుధాకర్, బండమీద అశోక్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పరిశీలన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కన్నెపల్లిలో ప్లాంటేషన్‌ను పీసీసీఎఫ్ ఎంసీ పార్గెన్(ఐఎఫ్ఎస్) పరిశీలించారు. శుక్రవారం ఆయన కన్నెపల్లిలో ఏర్పాటు చేసిన 7.5హెక్టార్లలోని ప్లాంటేషన్‌ను పరిశీలించి, కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపుహౌస్, మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీలను సందర్శించారు.

కాళేశ్వరాలయంలో పూజలు

కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని పీసీసీఎఫ్ ఎంసీ పార్గెన్ దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు రాగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ అర్చకులు సన్మానించారు. వారి వెంట డీఎఫ్ఓ లావణ్య, ఎఫ్‌డీఓ వజ్రారెడ్డి, రేంజర్ కమల, డీఆర్ఓ అంజయ్య, సిబ్బంది ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న పీసీసీఎఫ్, డీఎఫ్ఓలు

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలి

- ఏఆర్‌సీఐ డైరెక్టర్ టాటా నర్సింగరావు
- నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్

కాజీపేట అర్బన్: సమాజంలోని సామాన్యుల ఆవశ్యకతకు అనుగుణంగా ఆవిష్కరణలు చేపట్టాలని ఏఆర్‌సీఐ డైరెక్టర్ టాటా నర్సింగరావు తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఐసీమెక్-ఆర్ఈసీ-23 పేరిట మూడ్రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా ఏఆర్‌సీఐ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ టాటా నర్సింగరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సౌజన్యంతో ఇతర ఇంజనీరింగ్ విభాగాల్లోని సమస్యల పరిష్కారానికి కాన్ఫరెన్స్ వేదికగా నిలవాలని తెలిపారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్ సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బిద్యాధర్ సుబుదీ తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను విడుదల చేస్తున్న ఏఆర్‌సీఐ డైరెక్టర్, నిట్ డైరెక్టర్, ప్రొఫెసర్లు

సర్పంచ్‌కు 14 రోజుల రిమాండ్


తిరుపతి నాయక్

తరిగొప్పుల : వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకోగా అందుకు కారణమైన సర్పంచ్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జాటోతు భోజ్యాతండా శివారు రూప్లాతండాకు చెందిన భూక్య అనిత ఈనెల 13న వరకట్న వేధింపులు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఏసీపీ దేవేందర్‌రెడ్డి చేపట్టిన విచారణలో మృతురాలి చిన్నమామ భోజ్యాతండా సర్పంచ్ భూక్య తిరుపతి నాయక్ పాత్ర ఉందని తేలడంతో అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. దీంతో తిరుపతినాయక్‌ను జనగామ సబ్‌జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

పోలీసు కస్టడీకి పిటిషన్..!

- రామకృష్ణయ్య హత్య కేసులో రెండో పిటిషన్‌కు పోలీసుల సిద్ధం?

జనగామ: రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్య హత్య కేసులో నిందితులను మరోసారి కస్టడీకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టులో దీనిపై పోలీసులు పిటిషన్ వేయగా, కస్టడీకి అవకాశం దొరకలేదని తెలిసింది. గిరబోయిన అంజయ్య తదితర నిందితుల కస్టడీ కోసం ఈనెల 26న(సోమవారం) పోలీసులు మరోసారి పిటిషన్ వేయనున్నట్లు సమాచారం. రామకృష్ణయ్య హత్య కేసుతోపాటు అంజయ్య.. తన బావమరిది సతీమణి సుభద్రను సైతం చంపేసినట్లు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. గతంలో జరిగిన పలు మరణాలు సైతం మర్డర్లే కావచ్చనే అనుమానంతో తదుపరి విచారణకు అంజయ్య మిగతా నిందితుల కస్టడీ కోరుతూ పోలీసులు రెండోసారి పిటిషన్ వేస్తారనే సమాచారం ఉంది. ఇదిలా ఉండగా.. రిటైర్డ్ ఎంపీడీఓ హత్య కేసులో పోలీసులు మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. డీసీపీ పి.సీతారాం నేతృత్వంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ కేసుకు సంబంధించి అనుమానితులను రోజువారీగా విచారిస్తున్నారు.

సంబురాలపై విచారణ

బచ్చన్నపేట : పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య అనంతరం నిందితులు సంబురాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతున్నట్టు సమాచారం. మండలంలోని గోపాల్‌నగర్, నక్కవానిగూడెం, పోచన్నపేట గ్రామాలకు చెందిన పలువురిని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ నాగబాబును సంప్రదించగా అనుమానితులను విచారిసున్నామని చెప్పారు.

మార్కెట్ ఆదాయానికి గండి

- పత్తాలేని అగ్రిమెంటు.. పెండింగ్‌లో రూ.40 లక్షల అద్దె
- నిర్ణయంపై అధికారుల అలసత్వం
- చెల్లించేందుకు సిద్ధమంటున్న కవర్‌షెడ్ వ్యాపారులు
- పట్టించుకోని పాలకవర్గం... అధికార యంత్రాంగం


లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్


వ్యాపారులు లేక ఖాళీగా ఉన్న కవర్ షెడ్

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌ను ప్రభుత్వం కోట్లాది రుపాయలు ఖర్చు చేసి నిర్మించినా అధికారుల ఉదాసీనత, వ్యాపారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సుమారు రూ.50 లక్షల వరకు అద్దెల రూపంలో ఆదాయం మార్కెటింగ్ శాఖ కోల్పోయే ప్రమాదముంది. 95 కమీషన్ లైసెన్సుదారులకు మడిగెలు కేటాయించగా చిల్లర వ్యాపారులకు కవర్ షెడ్‌లో 158 ప్లాట్లు కేటాయించారు. కవర్‌షెడ్‌లో ప్లాట్లు కేటాయించిన అధికారులు వాటి నిర్మాణ వ్యయం లెక్కగట్టి ఇంజనీరింగ్ విభాగం అధికారులు రూ.2300ల అద్దె నిర్ణయించారు. మార్కెట్‌లో ఉన్న ఖాళీ ప్రదేశంలో ఓపెన్‌ప్లాట్లు కేటాయించడంతో కొనుగోలుదారులు లోపలికి రావడం లేదని కవర్ షెడ్‌లోని చిల్లర వ్యాపారులు పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నారు. దీనికి తోడు నిర్ణయించిన అద్దెలు ఎక్కువగా ఉన్నాయని తగ్గించాలని అధికారులను కోరడంతో అగ్రిమెంటు ప్రక్రియ నిలిచిపోయింది. కవర్‌షెడ్‌లోని ప్లాట్లకు నెలకు రూ.1500ల చొప్పున చెల్లిస్తామని వ్యాపారులు అధికారులకు తెలిపారు. అయినప్పటికీ అధికారులు స్పందించక పోవడంతో అద్దెలు తగ్గించాలని స్థానిక ఎమ్మెల్యేను వ్యాపారులు కోరడం, ఈ విషయం మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి దృష్టికి తీసుకుపోవడంతో వ్యవహారం మొత్తం పెండింగ్‌లో పడింది. అద్దెలు తగ్గించినా సుమారు రూ.40 లక్షల వరకు మార్కెట్ కమిటీకి ఆదాయం వచ్చేది. నెలలు గడుస్తున్నా...అగ్రిమెంట్లు చేయకపోవడం, అద్దెలు తగ్గించకపోవడంతో అధికారుల చూపుతున్న నిర్లక్ష్యంపై వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అగ్రిమెంట్లు చేస్తే గిరాకీ లేని కారణంగా కొంతమంది వ్యాపారులు ప్లాట్లు వద్దనే అవకాశాలు కూడా ఉన్నాయి. దీంతో ప్లాట్లు రాకుండా ఉండి ఆసక్తిగల వ్యాపారులకు వీటిని కేటాయించే అవకాశం ఉంది. ఇంత జరుగుతున్నా మార్కెట్ కమిటీ పాలకవర్గం, మార్కెటింగ్‌శాఖ జెడీఎం, డీడీఎం, డీఎంఓలు చొరవ చూపకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూరగాయల మార్కెట్‌లోని కవర్ షెడ్‌లో 158 చిల్లర వ్యాపారులకు 2022 మార్చి నెలలో కేటాయించారు. నిర్ణయించిన ప్రకారం అద్దె రూ.2,300ల చొప్పున 158 ప్లాట్లకు నెలకు రూ.3,63,400ల చొప్పున అంటే 16 నెలలకు రూ.58,14,400లు ఆదాయం కోల్పోయినట్లే. వ్యాపారులు కోరిన విధంగా రూ.1500ల చొప్పన వసూళ్లు చేస్తే నెలకు రూ.2,37,000ల చొప్పున 16 నెలలకు రూ.37,92,000లు అద్దెల రూపంలో మార్కెట్‌కు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

అగ్రిమెంటు చేస్తే అద్దెలు చెల్లిస్తాం...



అధికారులు అగ్రిమెంటు చేసి రూ.1500లకు అద్దెలు తగ్గిస్తే కట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. ఖాళీ ప్రదేశంలో విచ్చలవిడిగా ప్లాట్లను కేటాయించడంతో చిల్లర వ్యాపారుల వల్ల కవర్‌షెడ్‌లోకి ఎవరూ రావడం లేదు. దీనికి తోడు మార్కెట్ చుట్టూ చిల్లరగా కూరగాయలు అమ్ముతున్నా పట్టించుకోవడం లేదు. వీరిని అదుపు చేస్తే కవర్‌షెడ్‌లోకి వినియోగదారులు వస్తే వ్యాపారం జరుగుతుంది.

–కొలనుపాక సురేష్

మంచానికే పరిమితం

- చెట్టుపై నుంచి కిందపడి అంగవైకల్యంతో పోరాడుతున్న గీతకార్మికుడు
- భార్య మానసిక వికలాంగురాలు
- ఏడాది గడుస్తున్నా అందనిసాయం
- ఆపన్నహస్తం కోసం ఎదురు చూపులు


దీన గాథ


ఆర్థికసాయం అందించాలని కోరుతున్న సతీష్, భార్య రజిత

నెల్లికుదురు: ఓ మానసిక వికలాంగురాలైన మహిళను వివాహం చేసుకుని ఒక కూతురుతో సంతోషంగా జీవించాలనుకునే ఓ గీత కార్మికుడి జీవితం విధి ఆడిన వింతనాటకంలో తాటిచెట్టుపై నుంచి పడి నడుంవిరిగి 39 ఏళ్ల వయస్సులోనే మంచానికి పరిమితమయ్యాడు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లికి చెందిన కోటగిరి సతీష్‌ది పేద కుటుంబం. ఏడాది క్రితం తాటిచెట్టుపై నుంచి పడి నడుం విరిగి నడుం కిందిభాగం నుంచి ఎలాంటి స్పర్శలేకుండా పోయి కాళ్లు సచ్చుబడిపోయి కదలలేని స్థితిలో ఉన్నాడు. ఆస్పత్రి వర్గాలు జీవితకాలం ఇంతే ఎలాంటి చికిత్స చేసినా లాభం ఉండదని చేతులెత్తేశారు. పెద్దాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుందామంటే తింటానికే తిండిలేదు. సతీష్ భార్య రజిత పుట్టుకతోనే మానసిక వికలాంగురాలు. చిన్నపిల్లాడి వలే తన భర్తను, కూతురును కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. కనీసం వీరికి పింఛన్ కూడా ఇప్పటి వరకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, స్వచ్ఛంద సేవాసంస్థలు, గీత కార్మిక సంఘాలను బాధిత కుటుంబం ప్రాధేయపడుతోంది. దివ్యాంగులకు అందాల్సిన ఉపకరణాలు, డబుల్ బెడ్‌రూం, వంటివి ప్రభుత్వం మంజూరు చేసి అందించాలని వేడుకుంటున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత కుటుంబం చేతులెత్తి వేడుకొంటుంది.

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ **97053 02093, ఎస్‌బీఐ ఖాతా నంబర్ 386459 44988, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0005685**ని సంప్రదించాలని కోరారు.

కనిపించని 'నాలుగో సింహం'!

- ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ పదోన్నతుల జాబితాలో పేరు
- ఏడాది నుంచి విధులకు హాజరు కావడం లేదన్న ఐజీ..
- ఉమ్మడి జిల్లా పోలీస్‌శాఖలో చర్చనీయాంశంగా భరత్ అబ్సెంట్

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఉమ్మడి వరంగల్ పోలీసుశాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఓ పోలీసు అధికారి ఏడాదికి పైగా కనిపించడం లేదు. వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించి చివరికి వరంగల్ డీఐజీకి అటాచ్‌లో ఉన్న సదరు అధికారి ఏమయ్యాడనేది ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్లుగా ఉన్న 1996 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (డీఎస్పీ)లుగా పదోన్నతి పొందనున్నారు. సుమారు రెండేళ్ల కిందట 1995 బ్యాచ్‌కు సంబంధించిన పదోన్నతుల జాబితా వెలువడే సమయంలో 1996 బ్యాచ్‌కు చెందిన కొందరు కోర్టుకు వెళ్లడం.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 మందికి బ్రేక్ పడింది. ఇందులో మల్టీజోన్–1 చెందిన వారు 38 మంది ఉన్నారు. ఎట్టకేలకు రెండు నెలల తర్వాత ఆ జాబితా (1995 బ్యాచ్) క్లియర్ కాగా.. ప్రభుత్వం చొరవతో 1996 బ్యాచ్‌కు చెందిన వారికి కూడ డీఎస్పీలుగా పదోన్నతి కల్పించేందుకు ఇటీవల లైన్ క్లియరైంది. ఇందులో మల్టీజోన్–1లోని 38 జాబితాను కూడా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. ఈ జాబితాలోని ఒకరు సర్వీసు నుంచి తొలగించబడగా, ఇద్దరు మృతిచెందారు. మిగిలిన 35 మందిలో భరత్‌కుమార్ ఏడాదిగా విధులకు హాజరు కావడం లేదని పదోన్నతుల జాబితాలోని రిమార్క్స్‌లో ఐజీ పేర్కొన్నారు. బి.భద్రయ్యగా ఉన్న ఆయన భరత్‌కుమార్‌గా పేరు మార్చుకున్నారు. రెండేళ్ల కిందటి వరకు ఇంటెలిజెన్స్‌లో పని చేసిన భరత్.. పదోన్నతుల జాబితా వెల్లడి నాటికి 'ఏడాదికి పైగా విధులకు గైర్హాజర్'గా పేర్కొనడంపై పోలీసుశాఖలో చర్చ జరుగుతోంది. ఎస్‌ఐగా, సీఐగా పని చేసిన సమయంలో కూడా కొన్ని అంశాల్లో వివాదస్పదం అయ్యాడు. రియల్ ఎస్టేట్ రంగంలో కాలుపెట్టిన ఆయన డీఎస్పీ పదోన్నతుల జాబితా వెలువడే సమయానికి ఎక్కడికెళ్లాడు? ఏం చేస్తున్నాడు? అన్నది చర్చగా మారింది. విధులకు హాజరుకాకుండా.. ఉన్నతాధికారులకు కనిపించకుండా పోయిన ఈ 'నాలుగోసింహం' విషయం హాట్‌టాఫిక్‌గా మారింది.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట

- కీలకంగా మారనున్న ఎరువు
- సమగ్ర పోషకాలకు కేరాఫ్

కరీమాబాద్ : పంటల దిగుబడిలో 'పచ్చిరొట్ట' ఎరువు కీలకంగా మారుతోంది. సేంద్రియ వ్యవసాయంలో దీనికి ఎంతో ప్రాధాన్యం లభిస్తోంది. నేలకు కావాల్సిన సమగ్ర పోషకాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. అధిక దిగుబడి సాధించాలనే ఆశతో రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగించడంతో నేలల్లో భూసారం దెబ్బతిని పోషక పదార్థాల లోపంతో సమస్యలు ఎదురవుతున్నాయి. పచ్చిరొట్ట మూలంగా రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పచ్చిరొట్ట పైర్ల వాడకంలో రెండు రకాలు

పచ్చిరొట్ట పైర్ల వాడకంలో రెండు పద్ధతులున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

1. పచ్చిరొట్ట పైర్లను పొలంలో చల్లి అవి పెరిగిన తర్వాత అదే పొలంలో అక్కడికక్కడే భూమిలో కలియదున్ని తర్వాత పంటవేసుకోవడం. పైర్లు కుళ్లడానికి సరిపోయే రోజులు ముందుగా కలియదున్నాలి. అలా కాకుంటే 50 శాతం పూత వచ్చిన తర్వాత పంటను కలియదున్నాలి.
2. చెట్ల ఆకులు బయటి నుంచి సేకరించి పొలంలో వేసి కలియదున్ని అవి కుళ్లిన తర్వాత పంట వేసుకోవాలి.


పచ్చిరొట్టగా సాగుచేస్తున్న జనుము

వేసే సమయం..

రైతులు ఖరీఫ్ పంటల సాగుకు ముందు వేసవి (మే, జూన్)లో తొలకరి వర్షాలు పడిన వెంటనే దుక్కి దున్ని ఎకరాకు 12 నుంచి 15 కిలోల విత్తనం చల్లాలి. జనుము అయితే ఎకరాకు 20 కిలోలు చల్లాలి. దీర్ఘకాలిక పంటలు, పండ్లతోటల్లో వరుసల మధ్య పచ్చిరొట్ట పైరు వేసి పెరిగిన తర్వాత ఆ భూమిలోనే దున్నాలి.

పచ్చిరొట్టతో ప్రయోజనాలు...

- పచ్చిరొట్టలో సేంద్రీయ పదార్థం ఉండడంతో సూక్ష్మజీవులు విస్తారంగా వృద్ధి చెంది భూసారం పెంపొందడానికి ఉపయోగపడుతుంది.
- భూమిని గుల్లబరిచి నీటి నిలువ సామర్థ్యం పెంచి సులభంగా నీరు,గాలి వేర్లకు అందేలా చేస్తుంది.
- పచ్చిరొట్ట పైర్ల సాగుతో సూక్ష్మపోషక పదార్థాల లోపాలు రాకుండా ఉంటాయి.
- పచ్చిరొట్ట పైర్లు భూమిలో కుళ్లేటప్పుడు రసాయనిక ప్రక్రియలు జరిగి భూమిలోని పోషక పదార్థాలు మొక్కలకు అందుబాటులోకి వస్తాయి.
- చాలా రకాల పచ్చిరొట్ట పైర్లు పప్పుజాతికి చెందినవి కావడంతో గాలిలోని నత్రజని స్థిరీకరిస్తాయి.
- పాల చౌడు, నల్ల చౌడును నివారిస్తాయి.
- భూసార పరిరక్షణకు తోడ్పడుతాయి.

పచ్చిరొట్టతో రైతులకు మేలు..



వర్షాకాలం పంటలు సాగు చేసే ముందు భూముల్లో పచ్చిరొట్ట వేయడంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడడమే కాకుండా భూసారం పెరిగేందుకు తోడ్పడుతుంది. పంటల దిగుబడి కూడా పెరుగుతుంది. వేసవిలో భూములు ఖాళీగా ఉండడంతో పచ్చిరొట్ట వేయడం ద్వారా వచ్చే పంటకు మేలు చేస్తుంది.

-డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

కుడా లేఅవుట్ ప్లాట్లు అమ్మబడును

- కుడా లేఅవుట్ ప్లాట్లు అమ్మబడును. GWMC పరిధి న్యూ వెంచర్ చింతగట్టు, హన్మకొండ. LP No: 0414/L0/3006/2023. ఆఫీస్: సుబేదారి, HNK. T.స్వామి. సెల్: 9618331226. [W-785612]

HOUSE FOR SALE

- GWMC అప్రూవ్డ్ లే అవుట్ చింతగట్టు హన్మకొండలో విల్లా ప్లాట్లు 4BHK డూప్లెక్స్ హౌజ్స్ 3BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్ ప్రారంభమైనవి. శ్రీనివాస్. సెల్: 8978638094. [W-785618]
- వరంగల్ రంగశాయిపేట శేషాద్రి హిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy. 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666 / 8309035091 [WA-27116]
- ములుగురోడ్డు, కాకతీయ కెనాల్, కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27119]
- ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091 [WA-27113]
- వరంగల్ చౌరస్తాకి 7 కి.మీ. ఖమ్మం హైవేకి 500 మీ॥ వార్డేకి 2½ కి.మీ. ముందు మామునూర్‌లో ఎత్తైన ప్రదేశం 390 చ॥గ॥ G+1 పైన 4 క్రింద 3 రూంలు 1560 Sft తూర్పు ఫేసింగ్ 40 ఫీట్ల రోడ్ దక్షిణం 40 ఫీట్ల S/E కార్నర్ ప్లాటు చుట్టు కుడా లేఅవుట్ దగ్గర్లో నిర్మిత నిర్మాణమౌతున్న ఇళ్లు. సెల్: 9032111600. [W-785614]

FLAT FOR SALE

- KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్, అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091. [WA-27122]
- హన్మకొండ జూపార్క్‌కు 300 మీటర్ల దూరంలో ఫాల్ సీలింగ్, లిఫ్ట్, జనరేటర్ సౌకర్యంతో కేవలం రూ॥ 55 లక్షలకే 3 BHK ఫ్లాట్ అమ్మబడును. "Ready to Move". Cell: 6309840767. [WA-6986]
- HNK సహకార్‌నగర్, రాజ్ హోటల్ వెనుక హంటర్‌రోడ్‌లో వైష్ణవి రెసిడెన్సీ యందు 2nd Floor లో E2 - Flat అమ్మకానికి కలదు. సంప్ర॥ 9966507691. [WA-0276]

SHUTTER FOR LEASE / RENT

- HNK-సుబేదారి, స్పెన్సర్ దగ్గర లాయల్ ఆర్కేడ్‌లో 12 X 30 కమర్షియల్ స్పేస్ (షట్టర్స్) లీజుకు / రెంట్‌కు ఇవ్వబడును. సంప్ర॥ 9966507691. [WA-0277]

SERVICES

- హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి ఆర్థిక సహాయం చేయబడును. హన్మకొండ. 7569519258. [WA-6988]
- హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసి అమౌంట్ ఇప్పించబడును. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి చేయబడును. హన్మకొండ, వరంగల్. సంప్ర: 7842279342 [WA-6987]

LOANS

- సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ఫ్లాట్, ల్యాండ్ వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785652]

OLD AGE HOME

- మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467036/6281127224. [H-781637]

MINI GEEZER

- శ్రీ గాయత్రీ మినీ గీజర్స్ (5 sec.లో వేడి నీళ్ళు) సేల్స్ చేయుటకు డీలర్స్ కావలెను. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం. సంప్ర. సెల్ : 96663 32323, 95506 92836. [M-1221206]

WANTED

- వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం 21,000+ రూం+ భోజనం ఫ్రీ. సెల్: 6281342090, 9949857816. [WA-6990]
- Wanted Resource Persons (2), Any Degree with fluency in English. B.Ed / Teaching Experience preferable. Will to travel, M/F, Prkl, KZPT, HNK, Wgl. Sal.+ TA. Cell: 9676591600. [W-785662]
- Medha Nursing College - Arepally: M.Sc (Nursing), B.Sc (Nursing) Teaching Staff Vacancies. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, WGL. Time: 12 to 2pm. [WA-0236]
- To teach all subjects, for classes I to X, PET and Car driver Cum attender Contact Immediate, Salary Negotiable Cell: 9849211563, 9951465223. [WA-0270]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793448]

WANTED TEACHERS

- Wanted Teachers to teach Science upto 8th Class & To teach English Upto 8th Class. Cont: 9849943040. [W-785659]
- Wanted Lady Teachers for Pre-Primary, Mother Teacher for Primary 1st-5th Maths, Eng, Hindi Teachers, Supporting Teachers for Primary F/P Time. Fluent in Eng. Indian Kids High School, WGL. 9963006221 [W-785660]
- Wanted Primary Teachers to Teach All Subjects. Walk-in 9am - 12pm. WKPS, Postal Colony, HNK. Cell: 8500596555, 9652529521. [WA-6989]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వ్యవసాయ మోటార్లు చోరీ : నలుగురిపై కేసు

వర్ధన్నపేట : వ్యవసాయ మోటార్లను ఎత్తుకెళ్లిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన అడుప రాజు తన రెండు వ్యవసాయ మోటార్లు, ఎద్దు సత్యనారాయణ ఒక వ్యవసాయ మోటారును ఎస్సారెస్పీ కాల్వ వద్ద అమర్చుకుని తమ పంట పొలాలకు నీరు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 16న రాజు సమీప గ్రామానికి వెళ్లి తిరిగి 21న ఇంటికి వచ్చాడు. శుక్రవారం పంట పొలం వద్దకు వెళ్లి చూడగా తన రెండు మోటార్లు కనిపించలేదు. అదేవిధంగా సమీపంలో ఉన్న ఎద్దు సత్యనారాయణకు చెందిన ఒక వ్యవసాయ పంపుసెట్ కనిపించలేదు. ఆందోళనకు గురైన ఇద్దరు గ్రామంలోని పాత ఇనుప సామాను షాపు (వెంకటేశ్వర ఐరన్ షాపు)లో వెతికారు. మోటార్లు ముక్కలుగా కనిపించాయని గుర్తించారు. పాత ఇనుప సామాను యజమాని ఊర కృష్ణను విచారించగా ఈనెల 21న వర్ధన్నపేటకు చెందిన అంగడి శివ, వెలమకంటి ప్రణయ్, శివకృష్ణ తనకు మోటార్లు విక్రయించారని తెలిపారు. కొనుగోలు చేసిన కృష్ణతో పాటు వర్ధన్నపేటకు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. పంపుసెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


వికాస్ (ఫైల్)

చిట్యాల: అప్పుల బాధతట్టుకోలేక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని జడల్‌పేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎండీ. శాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జడల్‌పేటకు చెందిన తనుకు వికాస్(35) గ్రామంలోనే కిరాణంషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో తెచ్చిన అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లోని దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం అతని జేబులో వాంగ్మూలంతో కూడిన కాగితం లభించడంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిన్న వయస్సులోనే అప్పుల బాధతో మృతి చెందడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు.

వ్యవసాయ భూమిలోకి అక్రమ ప్రవేశం

- సర్పంచ్‌తో సహా నలుగురిపై కేసు

మహబూబాబాద్ రూరల్ : ఒకరి వ్యవసాయ భూమిలోకి ఓ సర్పంచ్‌తో పాటు మరో ముగ్గురు అక్రమంగా ప్రవేశించడంతో పాటు కొట్టి గాయపరిచిన సంఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేశామని కురవి-2 ఎస్సై మధుబాబు శుక్రవారం తెలిపారు. మహబూబాబాద్ మండలంలోని ఇస్లావత్‌తండ (ఎం) గ్రామానికి చెందిన ఇస్లావత్ వెంకన్న ఈనెల 21న సాయంత్రం తన వ్యవసాయ భూమిలో ఉండగా ఇస్లావత్ తండ సర్పంచ్ ఇస్లావత్ నరేష్ ఒక ట్రాక్టర్‌తో అక్కడికి వచ్చాడు. అందులోని ఇసుకను వెంకన్న భూమిలో పోస్తుండగా ఎందుకు ఇసుక పోస్తున్నావని ఆయన అడిగాడు. దీంతో సర్పంచ్ నరేష్ ఇది తన భూమి అని చెప్పి వెంకన్నను అసభ్యపదజాలంతో దూషించాడు. అంతేకాకుండా సర్పంచ్‌తో పాటు వచ్చిన ఇస్లావత్ వెంకన్న, శ్రీను, లచ్చిరాం, ఇస్లావత్ సుమన్‌లు కలిసి వెంకన్న, ఆయన కుమార్తె ఉషా, తండ్రి లాల్యను కొట్టి గాయపరిచారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

టేకుమట్ల(రేగొండ): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని గాంధీనగర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన లక్కర్సు మల్లేష్ తన భార్యతో కలిసి వన భోజనాలకు వెళ్లగా ఇంటి వెనకాల ఉన్న తలుపులు పగులగొట్టి ఇంట్లోని తులం బంగారంతో పాటు, రూ.35వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని తెలిపారు. శుక్రవారం మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మిత్రుడికి తోడుగా వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ
- మరొకరికి తీవ్రగాయాలు


మృతి చెందిన అఖిల్ (ఫైల్)

చిల్పూరు : మిత్రుడికి తోడుగా వెళ్లి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై వినయ్‌కుమార్, కానిస్టేబుల్ ఇంద్రాచారిలు అందించిన వివరాల ప్రకారం..మండలంలోని మల్కాపూర్‌కు చెందిన తాడగోని సాయి, కనకం అఖిల్ ఇద్దరు మిత్రులు. సాయికి చెందిన ట్రాక్టర్ భూపాలపల్లిలో ఉండగా గ్రామానికి తీసుకొచ్చేందుకు మిత్రుడు అఖిల్‌ను తోడుగా రమ్మన్నాడు. సరే అనడంతో గురువారం రాత్రి ఇద్దరు కలిసి భూపాలపల్లికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ట్రాక్టర్ తీసుకవస్తూ చిన్నపెండ్యాల గ్రామ సమీపంలో మూత్ర విసర్జన కోసం రోడ్డు కిందకు దించుతుండగా హనుమకొండ నుంచి వెనకాలే వేగంగా వస్తున్న లారీ ట్రాక్టర్ ట్రాలీని కొట్టింది. దీంతో అఖిల్ (22) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా సాయికి తీవ్ర గాయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

విరోధిని, వహ్నివాసిని క్రమాల్లో పూజలు


విరోధిని అమ్మవారుగా స్నపనమూర్తి


వహ్నివాసిని అమ్మవారుగా..

హన్మకొండ కల్చరల్ : వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం అమ్మవారిని విరోధిని, వహ్నివాసినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు నిత్యాహ్నికం, చతుఃస్థానార్చనాది పూజలు చేశారు. అమ్మవారిని ముదురుఎరుపు గులాబీదండతో, లిల్లీపూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. స్నపనమూర్తిని కాళీక్రమంలో విరోధిని అమ్మవారిగా, భోగబేరాన్ని షోడశీక్రమంలో వహ్నివాసినిగా అలంకరించారు. శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ శేషు భారతి పర్యవేక్షించారు.

కెమిస్ట్రీ విభాగంలో ప్రాంగణ నియామకాలు


ప్రాంగణ నియామకాల్లో పాల్గొన్న విద్యార్థులు, సంస్థ ప్రతినిధులతో రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కేయూలోని కెమిస్ట్రీ విభాగం, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రముఖ బల్క్‌డ్రగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ న్యూ ల్యాండ్ ప్రాంగణ నియామకాలు నిర్వహించింది. ఇందులో 50 మంది పాల్గొనగా.. 20 మంది రాత పరీక్ష పూర్తి చేశారు. వీరికి చివరి ఇంటర్వ్యూ హైదరాబాద్‌లో ఉంటుందని కెమిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ సవితాజ్యోత్స్న తెలిపారు. ఇందులో ఎంపికైతే రూ.2.35 లక్షల వార్షిక వేతనం ఉంటుందన్నారు. ఈప్రాంగణ నియామక ప్రక్రియలో న్యూలాండ్ సంస్థ బాధ్యులు శివకుమార్, డాక్టర్ ఆర్నాట్‌రాయ్, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ వెంకటయ్య, ప్లేస్‌మెంట్ ప్రతినిధులు వి.రమణబాబు, కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ప్రాంగణ నియామకాల్లో పాల్గొన్న విద్యార్థులను కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు అభినందించారు.